ప్రజాశక్తి
ఆదివారం 11 సెప్టెంబరు 2022
5
శ్రీకాకుళం





పలాస: ఉధృతంగా ప్రవహిస్తున్న వరహాల గెడ్డ

విస్తారంగా వర్షాలు



శ్రీకాకుళంలో జోరుగా కురుస్తున్న వర్షం

- అల్పపీడన ప్రభావంతో జిల్లాలో పలు చోట్ల భారీ వర్షాలు
- శ్రీకాకుళంలో అత్యధికంగా 94.2 మిమీ
- ప్రధాన నదుల్లో పెరుగుతున్న వరద
- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు
- నీట మునిగిన పంట పొలాలు
- అధికార యంత్రాంగం అప్రమత్తం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, విలేకరుల యంత్రాంగం

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసాయి. జిల్లాలో గరిష్టంగా శ్రీకాకుళంలో 94.2 వర్షం కురిసింది. జిల్లాలో సగటున 24.2 మి.మీ వర్షం కురిసింది. వర్షాల ఉధృతితో వాగులు, గెడ్డలు పొంగి పోర్లుతున్నాయి. వంశధార, నాగావళి, బహుదా నదుల్లో భారీగా వరద నీరు చేరుతోంది. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. శనివారం శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో తహశీల్దార్లు, ఎంపిడిఒలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో దండోరా వేసి, లోతట్టు ప్రాంత ప్రజలను తరలించాలని, పురిపాకల్లో ఉన్న వారిని అప్రమత్తం చేయాలని ఆదేశాలు జారీ చేశారు

జిల్లా వ్యాప్తంగా శనివారం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. వర్షాల ఉధృతితో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలాస మండలం లొత్తూరు కొండలపై కురిసిన భారీ వర్షాలకు గెడ్డలు, వాగులోకి వరదనీరు వచ్చి చేరడంతో కంబిరిగాం వంతెనమీదుగా వరహాలగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. పలాస మండలం కిష్టుపురం అండర్ పాసేజ్ వద్ద వరద నీరు వచ్చి చేరడంతో నడుం లోతులో నీరు నిల్వ ఉండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గరుడకండి, జగదేవపురం, కిష్టుపురం, లక్ష్మీపురం బ్రాహ్మణతర్లా, బంటు కొత్తూరు, నీలిభద్ర, కేసుపురం, నారాయణపురం. అమల కుడియా. పూర్ణభద్ర తదితర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. మెళియాపుట్టి మండలం గోకర్ణపురంలో రాధాసాగరం గెడ్డ పొంగడంతో నడకదారి నీట మునిగింది. దీంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.




పలాస: కిష్టుపురం అండర్ పాసేజ్ వద్ద నిలిచిన వర్షపునీరు

నీటమునిగిన పంట పొలాలు

మెళియాపుట్టిలోని భగడ సాగరం గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో సిరియాకండి, పెద్దజగన్నాథపురం, గోకర్ణపురం తదితర ప్రాంతాల్లో పొలాలు నీట మునిగాయి. మందస ప్రధాన రహదారిలో పట్టుపురం సమీపంలోని ఆఫ్‌షోర్ కాలువ నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. సారవకోట మండలంలో సారవకోట, కుమ్మరకుంట గ్రామాల మధ్య ప్రధాన రహదారి పక్కన ఉన్న వరి చేలు నీట మునిగాయి. నరసన్నపేట ప్రధాని హైవే ఆనుకుని ఉన్న గొట్టుపల్లి ప్లై ఓవర్ వద్ద రెండు మూడు అడుగులు ఎత్తులో నీటి ప్రవాహం ఉన్నందున ఆ ప్రాంతంతో పాటు పలు గ్రామాల ప్రజల ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది. ఇచ్ఛాపురంలోని భీమసముద్రం ఉప్పొంగడంతో మండపల్లి, రత్తకన్న, పద్మపురం గడ్డ వల్ల ఇన్నేసుపేట, ధర్మపురం, సోంపేట మండలంలోని బీల పరిధిలోని లక్కవరం, బెంకిలి, బారువా, గొల్లగండి, బుషికుద్దలో వరి పొలాలు నీట మునిగాయి.



ఇచ్ఛాపురంలో..




మెళియాపుట్టిలో నీట మునిగిన వరి

ప్రధాన నదుల్లో పెరిగిన వరద ప్రవాహం

వర్షాల ప్రభావంతో వంశధార, నాగావళి, బాహుదా నదుల్లో వరద ప్రవాహం పెరుగుతోంది. హిరమండలంలోని గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ప్రవాహం శనివారం సాయంత్రం 6గంటల సమయానికి ఇన్‌ఫ్లో 15,575 క్యూసెక్కులుగా ఉండగా అవుట్ ఫ్లో 20,675 క్యూసెక్కులుగా ఉంది. 18 గేట్లు ఎత్తి నీటిని కిందికి విడిచిపెడుతున్నారు. సువర్ణముఖి ఉధృతంగా ప్రవాహించడంతో మడ్డువలస రిజర్వాయర్ నుంచి నాగావళిలోకి భారీగా వరదనీరు చేరుతోంది. శ్రీకాకుళం పాతవంతెన వద్ద శనివారం గరిష్టంగా 29వేలు క్యూసెక్కుల నీరు ప్రవహించింది. వరద ప్రవాహం 35వేల క్యూసెక్కుల వరకు చేరొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒడిశాలోని భగలట్టి డ్యాం నుంచి భారీగా వరదనీటిని విడిచిపెట్టడంతో మహేంద్రతనయలో 28వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. మహేంద్ర తనయాలో 3వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

నీట మునిగిన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్

జిల్లా కేంద్రంలో భారీ వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నీట మునిగాయి. వర్షపు నీటికి, మురుగు కాలువల నీరు తోడవడంతో మోకాలు లోతు నీరు చేరింది. దుర్వాసన వస్తున్న నీటిలోనే రాకపోకలు సాగిస్తూ ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. నరసన్నపేట బస్ స్టేషన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన రహదారులు సైతం నీట మునిగాయి. పాత బస్టాండ్-అరసవల్లి రోడ్డు, పొట్టి శ్రీరాములు జంక్షన్, కిన్నెర థియేటర్ కూడలి, కృష్ణా పార్కు, రైతుబజార్ తదితర ప్రధాన రహదారులతో పాటు డిసిసిబి, ఇందిరానగర్, ఎఎస్ఎన్ తదితర కాలనీలు జలమయ మయ్యాయి. కాలువలు పొంగి పొర్లడంతో పలు వీధులను మురుగునీరు ముంచెత్తింది.



జలమయమైన నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్

అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షపాతం వివరాలు

మండలం	కురిసిన వర్షపాతం(మిమి)
పాతపట్నం	7.8
సారవకోట	11.4
కొత్తూరు	4.8
హిరమండలం	17.4
మెళియాపుట్టి	12.0
రణస్థలం	28.2
ఎచ్చెర్ల	50.8
సరుబుజ్జిలి	8.4
లావేరు	27.4
ఎల్ఎన్‌పేట	12.2
జి.సిగడాం	16.2
పొందూరు	13.8
బూర్జ	24.8
శ్రీకాకుళం	94.2
నరసన్నపేట	33.6
పోలాకి	18.8
ఆమదాలవలస	18.8
గార	72.4
సోంపేట	39.4
కంచిలి	20.4
జలుమూరు	7.4
మందస	33.6
ఇచ్ఛాపురం	23.6
సంతబొమ్మాళి	20.8
టెక్కలి	12.0
నందిగాం	23.2
కవిటి	13.2
కోటబొమ్మాళి	12.2
వజ్రపుకొత్తూరు	26.0
పలాస	22.6

'జలజీవన్ మిషన్'తో ఇంటింటికీ తాగునీరు

- రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారాం
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆమదాలవలస

జల జీవన్‌మిషన్‌తో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. మండలంలోని తొగారం పంచాయతీలో రూ.2.58 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తొగరాంలో రూ.54 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలు, రూ.1.02 కోట్లతో మనబడి నాడు-నేడులో భాగంగా అదనపు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇసుకలపేటలో రూ.38 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు, రూ.16 లక్షలతో అంగన్వాడీ భవనం, రూ.12 లక్షలతో పాఠశాల ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇసుకలపేటలోని జగనన్న కాలనీలో 20 ఇళ్లను స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం విద్య, వైద్యం, సేద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. మనబడి నాడు-నేడు ద్వారా విద్యాలయాలు అందంగా రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యా విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు.

ఈ నియోజకవర్గంలో రెండు నదులు ఉన్నప్పటికీ తాగునీరు, సాగునీటికి ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమస్య అదిమించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినేని వాణి సీతారాం, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఎంపిపి తమ్మినేని శారదమ్మ, జెడ్‌పిటిసి బి.గోవిందరావు, సరుబుజ్జిలి ఎంపిపి కెవిజి. సత్యనారాయణ, మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు ఎం.వెంకటరమణ, జగన్నాథరావు, బి.నారాయణరావు, హౌసింగ్ పీడీ గణపతి, పి.శ్రీనివాసరావు, సూర్యనారాయణ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



తొగారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

- జిల్లా జడ్జి జి.గోపి
- క్షణికావేశం జీవితాన్ని చిదిమేస్తోంది: కలెక్టర్
- జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - బలగ

ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని జిల్లా జడ్జి జి.గోపి అన్నారు. శనివారం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యాన అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా నగరంలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన సభలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చేపట్టిన అవగాహనా ర్యాలీని జిల్లా జడ్జి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జిఆర్.రాధిక జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఏడు రోడ్ల కూడలి మీదుగా గాంధీపార్కు, డేఅండ్‌నైట్ జంక్షన్ మీదుగా జిల్లా పోలీసుశాఖ కార్యాలయం వరకు సాగింది. తొలుత నిర్వహించిన సభలో జిల్లా జడ్జి జి.గోపి మాట్లాడుతూ క్షణికావేశంలో ఉత్పన్నమైన భయంకర ఆలోచనలకు గురికాకూడదన్నారు. తల్లిదండ్రుల ఆలోచనలో మార్పురావాలని, అందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. సమాజంలో అన్ని రంగాల్లోనూ అద్భుత అవకాశాలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారులపై అనేక ఒత్తిడి ఉన్నప్పటికీ అధిగమించే దిశగా అడుగులు వేస్తామన్నారు. మనుషుల మధ్య జాతి వైరం లేదని, మీలో ఉన్న సంకల్పిత ఆలోచనలను విడనాడలన్నారు. మీరు మీ ఆలోచలను అదుపులో పెట్టుకోవాలన్నారు. సమస్యలు ఉంటే జిల్లా కోర్టుకు వచ్చి చెబితే మీకు మంచి సలహాలు, సూచనలు అందజేస్తామన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలతో జీవితాన్నే చాలించేస్తున్నారని అన్నారు. అన్ని సమస్యలను విస్మరించి ముందుకు నడవాలని పేర్కొన్నారు. ఆత్మహత్య ఒక నేరమని అందరూ గ్రహించాలన్నారు. మైదానంలో ఉండి పారిపోవడం పిరికితనం అన్నారు. ఒక పక్కన కూర్చుంటే విజయాన్ని సాధించలేరని, ప్రతి ప్రయత్నంలోనూ విజయాన్ని సాధించగలం అన్న నమ్మకంతో ముందుకు సాగాలన్నారు. జిల్లా ఎస్‌పి జి.ఆర్, రాధిక మాట్లాడుతూ మనం ఈ సమస్య తీవ్రతను గుర్తించగలమన్నారు, 2022లో 7.2 శాతం అధికంగా ఆత్మహత్యలు నమోదు అయ్యాయన్నారు. ప్రేమ, కుటుంబ కలహాలు, ఇతర చిన్న చిన్న కారణాలకు చనిపోయే ధైర్యం ఉన్న వారు ఆ ధైర్యం బతికేందుకు ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. సమస్య వచ్చినప్పుడు అధిగమించడానికి చుడాలిగానీ ఆత్మహత్యకు పాల్పడకూడదన్నారు. మీరు గొప్పగా తయారై పది మందికి మార్గదర్శకులు కావాలని, మీకు ఏమైనా సమస్యలు ఎదురైతే రోషిని హెల్ప్ లైన్‌కు 9166202000 ఫోన్ చేస్తే వారు మీ సమస్యకు పరిష్కారం చూపుతారని అన్నారు. క్షణకావేశంలో చేసుకున్న ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని, మీ కోసం ఓ కుటుంబం ఉందని ఆలోచిస్తే ఆత్మహత్య చేసుకునే ఆలోచనే దగ్గరకు రాదని ఎస్‌పి హితవుపలికారు. మానసిక వైద్యులు డాక్టర్ సాయిరాం మాట్లాడుతూ ఆత్మహత్య సామాజిక ఆరోగ్య సమస్యగా మారిందన్నారు. ఒక వ్యక్తి ముఖభావం బట్టి, నడవడికలో మార్పు కనిపించిన వారిని మానసిక వైద్యులకు చూపిస్తే కౌన్సెలింగ్ ద్వారా వారి ఆలోచనల్లో మార్పు తేవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఎటువంటి పరిస్థితుల్లోనూ మానసిక ధైర్యం కోల్పోయి ఆత్మహత్య ప్రయత్నం చేసుకోబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎస్‌పి వి.ఎన్. మణికంఠ, అదనపు ఎస్‌పి కె.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు ఎం.మహేంద్ర, వాసుదేవ్, ప్రసాద్‌రావు, సిఐలు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ఎన్‌సిసి కెడిట్‌లు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్‌పి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్‌పి

వైసిపిలో చల్లారని అసంతృప్తి

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపిలో ద్వితీయశ్రేణి నాయకులు ప్రస్తుతం చేతినిండా పని దొరుకుతోంది. నాయకులకు పనులు దొరకుతున్నాయంటే అవేవో కాంట్రాక్టు పనులో, ఆర్‌బికెలు, సచివాలయాల నిర్మాణాల్లో అనుకుంటే పొరబడినట్లే. అవి దొరకనీయకుండా అడ్డుకుంటున్నారన్న ఆక్రోషంతో తమ నేతలతో అమీతుమీ తేల్చుకునేందుకు అసమ్మతి సమావేశాలు నిర్వహిస్తూ.. తీరిక లేకుండా ఉన్నారు. పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై తిరుగుబాటు చేసిన అసమ్మతి నాయకులు మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ.. తమ స్వరాన్ని పెంచుతున్నారు. ఇటీవల పలాసలో సమావేశం నిర్వహించిన అసమ్మతి గ్రూపు తాజాగా మందస మండలంలో సమావేశమై మంత్రి తీరుపై మరోసారి తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. ఇది ఇలా అధికార పార్టీకి చెందిన మరో వైపు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌పైనా ఎప్పటి నుంచో ఎచ్చెర్ల నియోజకవర్గంలో అమస్మతి గూడు కట్టుకుంది. ఇటీవల వరకు ఎమ్మెల్యేతో మంచి సంబంధాలు నెరపిన ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవి ఆయనపైనే తిరుగుబాటు జెండా ఎగురవేశారు. తనను సమర్థిస్తున్న ఆరుగురు ఎంపిటిసిలతో ఒక గ్రూపు ఏర్పాటు చేసి ఎమ్మెల్యేకు సవాల్ విసురుతున్న పరిస్థితి అక్కడ నెలకొంది. పాతపట్నం నియోజకవర్గంలో పంచాయతీ, స్థానిక ఎన్నికల నుంచి మొదలైన అసంతృప్తి ఇంకా కొనసాగుతూనే ఉంది. తమ పనులు కావడం లేదంటూ పాతపట్నంలో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేనే ఏకంగా నిలదీశారు.

టెక్కలి నియోజకరవర్గం పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదు. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్ గ్రూపుల మధ్య నివురుగప్పిన నిప్పులా అసమ్మతి నెలకొంది. జిల్లాలో పలాస, టెక్కలి, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో పార్టీలో గ్రూపుల పోరు కొనసాగుతున్నా, పార్టీలో వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏ నియోజకవర్గం సమస్య వారే చూసుకోవాలన్నట్లుగా అధిష్టానం ఉండటంతో నానాటికీ గ్రూపుల పోరు మరింత అధికమవుతోంది. తమను వ్యతిరేకించే వారిని పదవులకు, పార్టీకి దూరం చేసేలా ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు వ్యవహరించడంతో తిరుగుబాటు మొదలవుతోంది. దీనికి ముగింపు పలకడంతో అసమ్మతి నాయకులు తమ పనితాము చేసుకువెళ్తున్నారు. జిల్లాలో పార్టీ పెద్దలెవరూ పట్టించుకోకపోవడంతో ఏకంగా అధిష్టానానికే పిర్యాధు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వైసిపి జిల్లా నాయకత్వంలో నిష్క్రియాపరత్వం కొనసాగుతోంది. అసమ్మతి నాయకులతో సమావేశమై వారి సాధకబాధకాలు పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో పార్టీలో మూడు గ్రూపులు, ఆరు సమావేశాలు అన్నట్లుగా తిరుగుబాట్లు జరుగుతున్నాయి. జిల్లా పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు చూస్తున్న ధర్మాన కృష్ణదాస్‌కు నిమిత్తమాత్రులుగా మారారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించడం, కార్యకర్తల కష్టాలను తెలుసుకునే పనేది చేయకపోవడంతో వైసిపిలో అసంతృప్తి ఒక్కో నియోజవర్గానికి పాకుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీకి మరింత నష్టం జరుతుందని పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి

వైసిపిలో నాయకుల మధ్య ఎన్ని విభేదాలు ఉన్నా, జనానికి నష్టం కలిగించే అంశాల్లో మాత్రం వారంతా ఒక్కటవుతున్నారు. పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు, ఎమ్మెల్యే దువ్వాడ శ్రీనివాస్ సోదరులకు పలాసలో పోరు సాగుతున్నా. టెక్కలి నియోజకవర్గంలో జరిగే పనులకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మద్దతు పలకడం విశేషం. సంతబొమ్మాళి మండలం భావనపాడు పోర్టు విషయంలో ప్రజల న్యాయం చేస్తామని మంత్రి అప్పలరాజు చెప్తూ ప్రజలను ఒప్పించే ప్రయత్నం చేస్తుండగా, ఆ పని వేగంగా జరిగేలా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తన వంతు సహకరిస్తున్నారు. ప్రభుత్వం పోలీసు బలగాల సమక్షంలో తీవ్ర నిర్బంధం మధ్య సంతబొమ్మాళి మండలం మూలపేటలో ఇళ్లకు కొలతలు వేస్తున్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధులెవరూ నోరుమెదపలేదు. ఇళ్ల సర్వేపై తిరగబడతారన్న సమాచారంతో గ్రామ పెద్దలపై బైండోవర్ కేసులు పెట్టి, జనాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్న సమయంలో సిపిఎం రాష్ట్ర నాయకులు పి.మధు నాయకత్వంలోని బృందం ఆ ప్రాంతంలో చేసిన పర్యటన గ్రామస్తులకు ధైర్యాన్ని ఇచ్చింది. ఆర్అండ్‌ఆర్ ఏం ఇస్తారో కూడా చెప్పకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం తీరును ఎండగట్టి వారికి అండగా నిలుస్తామని సిపిఎం భరోసా నివ్వడం అభినందనీయం.

భవన నిర్మాణాల్లో నిర్లక్ష్యమెందుకు?

- అధికారులను ప్రశ్నించిన కలెక్టర్
- నర్సిపురం విఆర్‌ఒ సస్పెన్షన్
- టెక్కలి ఆర్‌డిఒ, టెక్కలి, సంతబొమ్మాళి ఎంపిడిఒలకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భవన నిర్మాణాల్లో తాత్సారం ఎందుకు జరుగుతోందని, ఇందులో ఎవరిది నిర్లక్ష్యమని భావించాలో మీరు చెప్పాలని కలెక్టరు శ్రీకేష్ లాఠకర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కళావేదికలో పంచాయతీరాజ్, రెవెన్యూశాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో నిర్మాణ పనులు మంజూరు చేస్తే మూడు మండలాలు మినహా మిగిలిన మండలాల్లో పనులు ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని కలెక్టరు ప్రశ్నించారు. జిల్లాలో నిర్మాణ దశలో 690 భవనాలు ఉంటే మరో 180 భవనాలు ఇప్పటివరకు పనులు ప్రారంభంకాకపోవడం ఏమిటన్నారు. మందస, ఇచ్ఛాపురం, జి.సిగడాం మండలాల్లో అన్ని భవనాలూ పూర్తి చేశారని, మిగిలిన 27 మండలాల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అక్కడున్న సామర్థ్యం మిగిలిన మండలాల్లో ఎందుకు లేదని ప్రశ్నించారు. రాష్ట్రస్థాయిలో భవన నిర్మాణాల్లో అట్టడుగున ఉన్నామని, అందుకు పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. అధికారుల తప్పిదం వల్ల జిల్లా ప్రగతి కుంటుపడటం సరికాదన్నారు. ఏడాది గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడానికి ఉన్న అడ్డంకులు ఏమిటో చెప్పాలన్నారు. ఈ నెల 15 నాటికి పనులు ప్రారంభం కాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.. టెక్కలి డివిజన్ కేంద్రంలోనే 10 భవనాలు మంజూరు చేస్తే ఏ ఒక్కటి ఇప్పటివరకు మొదలు పెట్టలేదని, అందుకు టెక్కలి ఆర్‌డిఒదే పూర్తి బాధ్యత అన్నారు. ఆయనకు షోకాజ్ నోటీసు జారీచేయాలని డిఆర్‌ఒను ఆదేశించారు. టెక్కలి ఎంపిడిఒకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జెడ్‌పి సిఇఒను ఆదేశించారు. సంతబొమ్మాళి మండలం హెచ్.ఎం.పేట భవన నిర్మాణానికి సంబంధించిన ఏజెన్సీ సిమెంట్ తీసుకొని వెళ్లి పనులు మొదలుపెట్ట లేదని, అందుకు బాధ్యులైన కాంట్రాక్టరుపై పోలీసు కేసు పెట్టాలని ఆదేశించారు. సంతబొమ్మాళి ఎంపిడిఒకు షోకాజ్ ఇవ్వాలన్నారు. నర్సిపురంలో స్థలం గుర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విఆర్‌ఒను సస్పెండ్ చేయాలని, తహశీల్దారుపైనా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒను ఆదేశించారు. పొందూరు, ఆమదాలవలస మండలాల్లో మంజూరైన వాటిలో 51 భవన నిర్మాణాలు ప్రారంభం కాలేదని అందుకు తహశీల్దార్లు, ఎంపిడిఒలు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఎఇ, విఆర్‌ఒలను సస్పెంచ్ చేస్తామని హెచ్చరించారు. స్థల వివాదాలుంటే ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించి పనులు మొదలు పెట్టాలన్నారు. నిర్మాణాలను అవసరమైన ప్రభుత్వ స్థలం, దాతల స్థలం లేదా ప్రభుత్వ భూమిని ఇచ్చి ప్రత్యామ్నాయంగా జిరాయితీ భూమిని తీసుకుని భవనాలను నిర్మించాలన్నారు. ఆ దిశగా ఎందుకు ఆలోచన చేయడం లేదన్నారు. సమావేశానికి హాజరుకాని హిరమండలం ఎఇని వివరణ కోరారు. సమావేశంలో జెసి ఎం.విజయసునీత, ఆర్‌డిఒలు బి.శాంతి, జయరాం, సీతారాం, పంచాయతీరాజ్ ఎస్ఇ మూర్తి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్, 27 మండలాల తహశీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీరాజ్‌శాఖ ఉపకార్యనిర్వాహక, కార్యనిర్వాహక, సహాయ ఇంజినీర్లు, ఇంజినీరింగ్‌సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టరు శ్రీకేష్ లాఠకర్


ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మన్నాయుడు

కార్మికుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమలో పనిచేస్తున్న బంటుపల్లికి చెందిన కార్మికుడు డి.సూర్యనారాయణ ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మృతి చెందాడు. కార్మికులంతా స్పందించి మృతి చెందిన తోటి కార్మిక కుటుంబాన్ని ఆదుకోవడానికి తమ ఒక రోజు వేతనం రూ.2,15,200 ఆర్థిక సహాయం అందించారు. ఈ సాయాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.నారాయణరావు, జె.గంగరాజు మృతుని భార్య తవిటమ్మకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం కార్మికులకు పూర్తిస్థాయి పని దినాలు కల్పించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు తోటి కార్మిక కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. యాజమాన్యం కార్మిక కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. విరాళం అందజేసిన వారిలో యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా సిఐ సూర్యచంద్రమౌళి ఆధ్వర్యాన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ముందుగా పోలీస్ స్టేషన్ నుంచి ఇందిరా కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఐలు సిహెచ్.హరికృష్ణ, గోపాలరావు, ఎఎస్ఐ తులసినాయుడు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : చిన్న చిన్న కారణాలతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని సిఐ సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ వరకూ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్యలు వద్దు... బతకడం ముద్దు అంటూ ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఎస్ఐలు గోవిందరాజు, ఐ.హైమావతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: ఒత్తిడిని జయించినప్పుడే విద్యార్థులకు విజయం వరిస్తుందని ఎస్ఐ కె.రాము అన్నారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఎస్ఐ ఆధ్వర్యాన ఎస్‌విజె విద్యా సంస్థలు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి కవిటిలో ర్యాలీ నిర్వహించారు. 'ఆత్మహత్యాలు వద్దు... జీవితమే ముద్దు' అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువులోను, పోటీ పరీక్షల్లోనూ ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుని జీవితాలు పాడుచేసికోవద్దని కోరారు.

కోటబొమ్మాళి: క్షణికావేశం ఓ నిండు ప్రాణాన్ని క్షణకాలంలో కాటేస్తోందిని, కొంతమంది చిన్నచిన్న కారణాలతో పంతాలు, పట్టింపులకు పోయి మానసిక వ్యధకు గురై చివరకు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి అన్నారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్ఐ షేక్ ఖాదర్ బాష ఆధ్వర్యాన స్థానిక కస్తూరిబా విద్యార్థినులతో కొటబొమ్మాళిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తపేట కూడలి వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎఎస్ఐ కె.మన్మథరావు, పోలీసులు, ఉపాధ్యాయులు, విలేజ్ పోలీసులు పాల్గొన్నారు.

సోంపేట : ఆత్మహత్యలు క్షణికావేశంలో చేసుకుంటున్న వారు ఒక్క క్షణం ఆలోచించాలని సోంపేట, బారువ ఎస్ఐలు ఎస్.బాలరాజు, సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు సోంపేటలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు.

కంచిలి : క్షణికావేశంలో చనిపోయేందుకు నిర్ణయం తీసుకునేందుకు చూపిస్తున్న ధైర్యం బతకడానికి చూపించాలని కంచిలి పోలీసులు పిలుపునిచ్చారు. ఆత్మహత్యల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యాన విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఎచ్చెర్ల : ఎస్ఐ టి.సత్యనారాయణ ఆధ్వర్యాన ఆత్మహత్యల నివారణ దినోత్సవంలో భాగంగా స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మహత్యల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు...

శ్రీకాకుళం అర్బన్ : క్షణికావేశంలో యువతీ యువకులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని దళిత జెఎసి నేతలు కంఠ వేణు, యజ్జల గురుమూర్తి, తైక్వాండో శ్రీనులు సూచించారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ వంతు బాధ్యతగా సూచనలు చేశారు. కార్యక్రమంలో దళిత జెఎసి నాయకులు పెయ్యల చంటి, కుమిలి రాజేష్, చిత్తిరి రమేష్ లండ అప్పన్న, సాకేటి శ్రీకాంత్ పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు


సోంపేట : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


టెక్కలి రూరల్: మానవహారం చేపడుతున్న విద్యార్థులు


కంచిలి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


నగదు అందిస్తున్న ఎస్‌జిఎఫ్ సభ్యులు

మోహనరావు కుటుంబానికి అండ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

ఇటీవల మృతి చెందిన కవిటి మండలం నెలవంకకు చెందిన వలస కూలీ మోహనరావు కుటుంబానికి ఎస్జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. వలస కూలీకి తీరని కష్టం, వలస కూలీ మృత్యువాత అంటూ మోహనరావు కుటుంబ సభ్యుల దయనీయ పరిస్థితిపై 'ప్రజాశక్తి' వరుస కథనాలు ప్రచురించింది. దీనికి స్పందించిన ఎస్జిఎఫ్ సంస్థ మోహనరావు కుటుంబానికి తక్షణ సహాయంగా శనివారం రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్జిఎఫ్ సభ్యులు మాట్లాడుతూ దాతలు సహృదయంతో స్పందించి ఇద్దరు చిన్నారులతో ఉన్న మోహనరావు భార్యకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్జిఎఫ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫాసిస్టు ప్రమాదంలో దేశం

సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- పలాస

దేశం ఫాస్టెస్టు ప్రమాదం ఎదుర్కొంటుందని, ఆర్థిక నేరగాళ్లను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కాపాడుతున్నారని, లౌకిక ప్రజాస్వామ్య శక్తులు ఐక్యం కావాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిట్టి పాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డపాడులో జయక్క జీవిత చరిత్ర ఆమె స్వీయ రచనను శనివారం ఆవిష్కరించారు. అనంతరం న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 52 సంవత్సరాల విప్లవ రాజకీయంలో జయక్క ఎన్నడు వెనుకడుగు వేయలేదన్నారు. ఎత్తిన జెండాను దించలేదని, జయమ్మ తండ్రిని, భర్తని, ఈ దోపిడీ రాజ్యం బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపినా ముందుకు సాగిన వీర వనిత జయమ్మని కొనియాడారు. ఆనాటి నుంచి నేటి వరకు దేశంలో భూటకపు ఎన్‌కౌంటర్లు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 27 వేల మందిపై ఉప చట్టాన్ని పెట్టారని, ప్రశ్నించే వారి మీద కేసులు పెట్టడం దుర్మార్గపు చర్యగా భావిస్తున్నామని అన్నారు. అడవుల నుంచి ఆదివాసీలను గెంటివేస్తున్నారని, నూతన ఫారెస్టు చట్టాలు తెచ్చి కార్పొరేట్ సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టబెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 7 లక్షల ఎకరాల అటవీ భూములను మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో అంబానీ వంటి కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శిస్తున్నారు. ఎనిమిదేళ్ల కాలంలో 8 లక్షల కోట్లకు అంబానీ పడగెత్తాడని చెప్పారు. ఇది ఎలా సాధ్యమైందన్నారు. ఆర్థిక నేరగాలను, రేపిస్టులను, మోదీ సర్కార్ కాపాడుతుందని దుయ్యబట్టారు. సమావేశంలో లిబరేషన్ నాయకులు మల్లేశ్వరరావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేస్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గోరకల బాలకృష్ణ, జుత్తు వీరాస్వామి, కూర్మారావు, పోతనపల్లి కుసుమ, మద్దిల వినోద్, అరుణోదయ రాష్ట్ర నాయకులు భీమశంకర్, రాజు, జానపద కళాకారుడు కుత్తుం వినోద్ పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- కవిటి

నాయకుల నుంచి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరినీ పేరుపెట్టి పిలిచే పరిచయం, సరైన సమయంలో సరైన గుర్తింపు ఒక్క టిడిపిలోనే సాధ్యమని ఎమ్మెల్యే బెందాలం అశోక్ అన్నారు. తెలుగుదేశం పార్టీ బిసిసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యర్ర బాసుదేవ్ ప్రదాన్‌ను ఇటీవల నియమించారు. ఈ మేరకు కవిటి మండల సామంత్య తరగతులు పెద్దలు శనివారం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ని రామయ్యపుట్టుగలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి బిసి సెల్ కమిటీలో ఇచ్చాపురం మండల తెలుగు తమ్ముళ్లకు సముచిత స్థానం కల్పించిన నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అశోక్, కూన రవికుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని సామంత్య కుల పెద్దలు, టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అశోక్‌ను సన్మానిస్తున్న నాయకులు


నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ (ఇన్‌సెట్‌లో రమణారెడ్డి (ఫైల్))

మాజీ ఎంపిపి కన్నుమూత

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్ల మాజీ ఎంపిపి బళ్లాడ రమణారెడ్డి (64) కన్నుమూశారు. శుక్రవారం అనారోగ్యానికి గురై శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈయనకు భార్య విజయలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేశారు. ఆయన స్వగ్రామం కుప్పిలి. నాలుగు సార్లు ఎంపిటిసిగా, మూడు మూడు పర్యాయాలు ఎచ్చెర్ల మండలానికి ఎంపిపిగా ఎంపికయ్యారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రధాన నాయకులు ఒకరిగా ఉన్న ఈయన పులుసార్లు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ప్రయత్నించారు. రమణారెడ్డి మృతితో ఎచ్చెర్ల నియోజకవర్గ టిడిపి శ్రేణుల్లో విషాదం నెలకొంది. పార్టీ విజయంలో ఈయన పాత్ర కీలకంగా పనిచేశారు. 1987లో మొదటిసారి ఎంపిపికి ఎన్నికయ్యారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెనాయుడు, మాజీ మంత్రి కళా వెంకటరావు, పలువురు నేతలు ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్‌లో ఓదార్చారు. ఎమ్మెల్యే గొర్ల కిరణ్ కుమార్ స్వగృహానికి చేరుకొని ఆయన పార్థివదేహానికి అంజలిఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. జెడ్‌పిటిసి బళ్లాడ హేమమాలినిరెడ్డి, మాజీ ఎంపిపి బళ్లాడ జనార్థనరెడ్డి తదితరులు ఉన్నారు.


తరలిస్తున్న సిబ్బంది

క్షతగాత్రులను ఆదుకున్న గ్లో అంబులెన్స్

ప్రజాశక్తి- పలాస

నరసన్నపేట మండలం మబగాంకు చెందిన ధర్మాన లక్ష్మణదాసు, అమ్మజమ్మ, దేవి, సుజాతలు శనివారం కారులో విశాఖపట్నం వెళ్తున్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం గాయత్రి కళాశాల ఎదురుగా సంభవించిన రోడ్డు ప్రమాదంలో వారు గాయపడ్డారు. అదే సమయంలో శ్రీకాకుళం నుంచి పలాస వైపు వస్తున్న గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ అంబులెన్స్ చూసి క్షతగాత్రులను ఆదుకున్నారు. ప్రథమ చికిత్స అందించి శ్రీకాకుళం బగ్గు సరోజినీదేవి ఆస్పత్రికి తరలించారు. ఎవరికీ ఇటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సరైన సమయంలో సహాయ సహకారాలు అందించడంపై అంబులెన్స్ సిబ్బంది ధనుంజయ, పాపారావుకు అభినందనలు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసపోయిన యువతి

ప్రజాశక్తి- బలగ

ఫేస్‌బుక్‌లో పరిచయమై చివరకు ఆయన చేతిలో మోసపోయాయని బొందిలిపురం కాలనీకి చెందిన జిడగల హేమలత శనివారం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు... రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తోంది. నెల్లూరు జిల్లా గమళ్లపాలెంకు చెందిన బండ్ల రాజేష్‌తో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమై అది కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి ఇటీవల శ్రీకాకుళం వచ్చి పట్టణంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. కొద్ది రోజుల పాటు సహజీవనం చేశారు. ఇటీవల తన తల్లి అనారోగ్యానికి గురైందని, వెళ్లి చూసి వస్తానని చెప్పి రాజేష్ స్వగ్రామానికి వెళ్లాడు. ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో హేమలత రాజేష్‌కు ఫోన్‌చేసింది. ఫోన్‌లో నీతో నాకు ఎటువంటి సంబంధం లేదని తెగేసి చెప్పారు. దీంతో మోసపోయాయని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'స్టూడెంట్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్' విడుదల

శ్రీకాకుళం : స్కూల్ ఎడ్‌టెక్ కంపెనీ లీడ్ దేశంలోనే తొలిసారి 'స్టూడెంట్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్' విడుదల చేసినట్లు ఇండెక్స్ హెచ్‌ఆర్ సుభకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అధ్యయనం ద్వారా పాఠశాలలకు వెళు_న్న విద్యార్థుల ఆత్మవిశ్వాస స్థాయిని ప్రాంతాలు, నగరాలు, జనాభా ఇతర అంశాల ఆధారంగా పరిశీలించామన్నారు. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌తో భాగస్వామ్యం చేసుకున్నామని తెలిపారు. ఆత్మ విశ్వాసపరంగా అన్ని అంశాల్లోనూ మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు.

'కవి సామ్రాట్' సత్యనారాయణ


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

కవిటి: తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ్ పురస్కారం అందుకున్న మహోన్నత వ్యక్తి, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అని కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెందాలం మల్లేశ్వరరావు అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు పి.బి.కెశర్మ మాట్లాడుతూ 20వ శతాబ్దంలో ఆంధ్రా సాహిత్యానికి, ప్రత్యేకించి సంప్రదాయ సాహిత్యానికి పెద్దదిక్కుగా విశ్వనాథ సత్యనారాయణ వ్యవహరించారని అన్నారు. తన రచనల ద్వారా కవిత్వం, నవలలు, నాటకం, చిన్న కథలు, ప్రసంగాలతో పాటు చరిత్ర, తత్వశాస్త్రం, మతం, సామాజిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం, భాషాశాస్త్రం, మనస్తత్వశాస్త్రం, స్పృహ అధ్యయనాలు, జ్ఞాన శాస్త్రం, సౌందర్యం, ఆధ్యాత్మికత వంటి అనేక రకాల విషయాలను సత్యనారాయణ స్పృశించినట్టు విద్యార్థులకు వివరించారు. ఆయన ప్రసిద్ధ రచనల్లో శ్రీమద్రామాయణ కల్పవృక్షం (రామాయణం కోరికలు తీర్చే దివ్య వక్షం), కిన్నెరసాని పాటలు (మత్స్యకన్య పాటలు), వేయిపడగలు (ది థౌజండ్ హుడ్స్) ప్రముఖమైనవని అన్నారు. సత్యనారాయణకు అనేక అవార్డులతో పాటు 1971లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించినట్టు శర్మ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయుడు బెందాలం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎన్.విశ్వనాథం, బి.జానకిరావు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


మాట్లాడుతున్న వెంకటరత్నం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయి మార్కెట్ కమిటీల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు వర్తింప జేయాలని ఎపి వ్యవసాయ మార్కెట్ కమిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటరత్నం డిమాండ్ చేశారు. నగరంలోని ఎపి ఎన్‌జిఒ హోమ్‌లో జిల్లా అధ్యక్షులు కె.దుర్యోధన అధ్యక్షతన జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరకొర జీతాలు తీసుకుంటున్న ఉద్యోగులకు సంక్షేమ పథకాల్లో కోతలు పెట్టడం సరికాదన్నారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహాసభలు ఈ ఏడాది డిసెంబరు 10, 11 తేదీల్లో విజయవాడ గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సుధాకర యాదవ్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనం కోసం వారి సేవల్లో భాగస్వాములుగా ఉంటూ మార్కెటింగ్‌శాఖ ద్వారా ప్రభుత్వాన్ని ఆదాయాన్ని అందిస్తున్నామన్నారు. అయినప్పటికీ సమాన పనికి తగ్గ వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా నిలుపుదల చేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. రాష్ట్ర కోశాధికారి డి.సి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తూ విధి నిర్వహణ సమయంలోను, అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. సుదీర్ఘ కాలం పాటు పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. విధుల్లో ఉన్న ద్యోగులు మృతి చెందితే దహణ ఖర్చుల నిమిత్తం రూ.15 ఇవ్వాలన్నారు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదంలో మృతి చెందితే రూ.పది లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవ శ్రీరాములు, శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, రవి, బి.గౌరునాయుడు, తారక రామారావు, శోభారాణి, సరస్వతి పాల్గొన్నారు.

వాలంటీర్లను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్ల మండలంలోని ఈ నెల 3న గ్రామ వాలంటీర్లను అధికారులు నియమించారు. 5న మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరమణ సందర్శించారు. మండల సమావేశాలు, గ్రామ వాలంటీలర్ల నియామక విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా శుక్రవారం ఈ నెల 3న నియమించిన వాలంటీర్లను నిలుపుదల చేయాలని కలెక్టర్ ఎంపిడిఒ పావనికి ఆదేశిస్తూ... ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా నియమించిన వాలంటీర్లు సంక్షేమ పథకాలపై, సర్వేలపై పూర్తి అవగాహన లేదని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇంటర్వ్యూ నిర్వహించే సమయంలో తహశీల్దార్ లేనందున అభ్యర్థుల నియమకాలను నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారి నియామకాలు నిరాకరించి నూతన వాలంటీర్ల నియమకానికి కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు. ఈ నెల 12న కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని, 13 నుంచి 15 వరకు దరఖాస్తులు స్వీకరించాలని, 17 నుంచి 19 వరకు వరకు ఇంటర్వ్యూ నిర్వహించాలని పేర్కొన్నారు. 20న ఎంపికైన వాలంటీర్ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయాలన్నారు.

హృదయాన్ని తాకేదే కవిత్వం

ప్రజాశక్తి- ఆమదాలవలస

హృదయాన్ని తాకేదే కవిత్వముని ఆధ్యాత్మిక వేత్త, కవి, ఉపన్యాసకులు డాక్టర్ సనపల నారాయణమూర్తి అన్నారు. పట్టణంలోని సీతారామ కళ్యాణ మండపంలో విశ్వసాహితీ సంస్థ ఆధ్వర్యాన పొన్నాడ అప్పల నరసమ్మ చిన్నవాడు సేవా సంస్థ సౌజన్యంతో అధ్యక్షులు పొన్నాడ వరాహ నరసింహులు రచించిన 'జయము రైత', కార్యదర్శి కర్నేన జనార్ధనరావు రచించిన 'కవితా సౌరభము' అను రెండు పద్య గ్రంథాలను శనివారం ఆవిష్కరించారు. 'జయము రైత' గ్రంథమును పార్వతీపురం స్నేహ కళా సమితి నిర్వాహకులు గంటేడ గౌరునాయుడు ఆవిష్కరించారు. కవితా సౌరభవముపై రాజాం రచయితల వేదిక గార రంగనాథం పరిచయం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కవితా సౌరభమందు బావుకత, కవితాత్మ అనే గుణాలతో రచన సాగిందని ప్రాచీన కవుల రచనా పద్ధతిని అనుసరించారని అన్నారు. 'జయము రైత' గ్రంథాన్ని బెందాళం కృష్ణారావు పరిచయం చేస్తూ భారతదేశంలోనే కాదు ప్రపంచంలోని ఏ దేశంలోనైనా రైతు సమస్యలపై కవి తన ఆవేదనను, సమస్యలపై అవగాహనను, ప్రయివేటు పరం చేసేందుకు ప్రభుత్వాలు పూనుకొని దుష్టశాసనాలపై కవిత్వాన్ని అందించారు. రోటరీక్లబ్ చైర్మన్ పాత్రుని పాపారావు మాట్లాడుతూ విశ్వ సాహితీ సంస్థ స్వీయ వ్యయంతో సభలను నిర్వహించడం ముదావహమని అన్నారు. కార్యక్రమంలో గెడ్డాపు రాజేంద్రప్రసాద్, బెండి గోవిందరావు, తమ్మినేని సీతారామాచార్యులు, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

'ఐతమ్'లో ముగిసిన 'ఎఫ్‌డిపి'


పాల్గొన్న అధ్యాపకులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్‌హెచ్ విభాగంలో 'ఎసెన్షియల్ ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ ఫర్ ఇంజినీర్స్' అనే అంశంపై వారం రోజుల పాటు జరిగిన అధ్యాపకుల శిక్షణా తరగతులు శనివారం ముగిశాయని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీచెర్స్ (ఎఐటిటిటిఆర్) చండీఘర్ సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ ఆన్‌లైన్ సదస్సుకు రిసోర్స్‌పర్సన్లుగా డాక్టర్ పంకజ్ శర్మ, డాక్టర్ ఆశోక్ కుమార్, ఐఐటి పాట్నా నుంచి డాక్టర్ ప్రొలైదాస్, డెహ్రాడూన్కు చెందిన డాక్టర్ నవీన్ సింఘాల్లు ప్రధానంగా పాల్గొని ఇంజినీరింగ్ విద్యార్థులకు, పరిశ్రమలకు రసాయన శాస్త్ర ఆవస్యకత, రసాయన శాస్త్ర పరిశోధనల ప్రాధాన్యతను అధ్యాపకులకు క్షుణ్ణంగా వివరించామని పేర్కొన్నారు. ఈ సదస్సుకు కన్వీనర్‌గా అసిస్టెంట్ హెచ్‌ఒడి డాక్టర్ ఎం.రమణయ్య, కో-కన్వీనర్గా జె.సురేష్‌కుమార్ వ్యవహరించారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఐడి డాక్టర్ ఆర్.శాంతికుమార్‌లు పర్యవేక్షించారని చెప్పారు. అసిస్టెంట్ హెచ్‌డి డాక్టర్ ఎ.లక్ష్మణరావు, డాక్టర్ పిహెచ్‌కె చరణ్, 25 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మనుగడ

కలెక్టర్ సతీమణి శైలి లాఠకర్


మొక్కలు నాటుతున్న శీలా లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాతావరణంలో ప్రాణదారమైన ఆక్సిజన్ శాతాన్ని పెంచాలని కలెక్టర్ సతీమణి శైలి లాఠకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ, ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యాన పెద్దపాడు రహదారికి ఇరువైపులా జెసి ఎం.విజయ సునీతతో కలిసి శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. పచ్చదనం పెరిగినప్పుడే గాలిలో ఆక్సిజన్ పెరగడంతో పాటు వాయు కాలుష్యం తగ్గుతుందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో అవెన్యూ ప్లాంటేషన్ కింద రోడ్డుకిరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం ఆనందదాయకమన్నారు. నాటిన ప్రతి మొక్కరూ సంరక్షించాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని, అప్పుడే పచ్చ దనాన్ని పెంచుకోవచ్చుని అన్నారు. జెసి మాట్లాడుతూ జిల్లాలోని పౌరులందరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో 30 వేల మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రామలక్ష్మణ కూడలి నుంచి పెద్దపాడు వరకు రహదారికి ఇరువైపుల 800 మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఈషా ఫౌండేషన్ విశాఖ జోన్ హెడ్ఇ విఠల్‌రాజు, వంశీప్రియ, ఆదర్శ్, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బిఐ సేవలు వినియోగించుకోవాలి

పోలాకి : విద్యార్థులు ఉచితంగా జన్‌ధన్ ఖాతాలు ఓపెన్ చేస్తామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఎబిఐ అధికారి సోమశేఖర్ సూచించారు. మండలంలోని ఈదులవలస ఎపి మోడల్ స్కూల్‌లో జన్‌ధన్ ఖాతాలు ప్రారంభానికి క్యాంపెన్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల వయసు నుంచి 18 ఏళ్ల వయసు గల చదువుతున్న విద్యార్థులకు జీరో ఎకౌంట్‌లు ప్రారంభిస్తామని తెలిపారు. మీరు బ్యాంకు వద్దకు వెళ్లకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కస్టమర్ సర్వీస్ ప్రొవైడర్ ద్వారా ఓపెన్ చేస్తామని పేర్కొన్నారు. అథ్యాతీ టెక్నాలజీ జిల్లా మేనేజర్ రాము, పోలాకి ఎస్ఐబి మేనేజర్ సంధ్యారాణి, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జన్‌ధన్ ఖాతాలు ప్రారంభిస్తున్న సోమశేఖర్



మాట్లాడుతున్న రవికుమార్

రైతు యాత్రను అడ్డుకుంటాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 12వ తేదీన ప్రారంభం కానున్న అమరావతి రాజధాని రైతులు తలపెట్టిన అమరావతి టూ అరసవల్లి యాత్ర తెలుగుదేశం పార్టీ బూటకపు యాత్ర అని, ఈ యాత్రను జిల్లా ముఖద్వారం వద్ద అడ్డుకుంటామని నియోజకవర్గం వైసిపి నాయకుడు చింతాడ రవికుమార్ అన్నారు. జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నంలో కార్య నిర్వాహక రాజధాని ఏర్పాటు అనేది దశాబ్దాలుగా వెనుకబడి, నిరాదరణకు లోనైన ఉత్తరాంధ్ర అభివృద్ధికి దిక్సూచి అవుతుందని అన్నారు. విశాఖపట్నం రాజధానిగా మారితే ఐదేళ్లలోనే హైదరాబాద్ లా మన రాష్ట్రానికి అత్యధిక ఆదాయున్ని తెచ్చిపెట్టే బంగారు బాతులా మారుతుందని అన్నారు. సమావేశంలో పైడి రామారావు, చింతాడ రాఘవేంద్రరావు, తమ్మినేని రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

పొందూరు : మండలంలోని కింతలి, తోలాపి గ్రామాల్లో ఆదివారం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు పప్పుల రమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. కింతలిలో ఉదయం 10 గంటలకు, తోలాపిలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.



చెరువులో ఎండు చేపలను విడిచిపెడుతున్న మత్స్యకారులు

వర్షానికి తడిచిన ఎండు చేపలు

సోంపేట : అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తీరంలో మత్స్య సంపద ఎండక నష్టం వాటిల్లిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏకువూరు సమీపంలోని సముద్రతీరంలో నెత్తల్లు, కలవలు పెద్ద మొత్తంలో ఎండబెట్టిన నేపథ్యంలో వర్షాలు కురిశాయని, దీంతో అవి పాడయ్యాయని తెలిపారు. సరిగా ఎండని కారణంగా మధ్య సంపద పాడై దుర్గంధం వెదజల్లడంతో వాటిని తిరిగి సముద్రంలోకి పారవేశారు. నష్టపోయిన మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు.

అంగన్వాడీ పోస్టులకు 27 దరఖాస్తులు

బూర్జ: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తల, ఆయా పోస్టుల భర్తీకి 27 దరఖాస్తులు వచ్చాయని ఐసిడిఎస్ సిడిపిఒ గీతారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అల్లిన అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు 25, తోటవాడ పోస్టుకు రెండు దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

ఫ్యాను వితరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఎన్.టి.నగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో ఫ్యాన్ లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం సభ్యులు లాడి అనిల్ స్పందించి శనివారం అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్ వితరణగా అందజేశారు. ఫ్యాన్‌ను అంగన్వాడీ కార్యకర్త మనోరమకు శనివారం అందజేశారు. అలాగే చిన్నారుకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, సభ్యులు లాడి అనిల్, యన్ సింహాచలం, లిఖిత, రంజన్ ప్రధాన్, రమేష్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న రామజోగినాయుడు

సమాజమలో నిస్వార్థ సేవలు అందిస్తున్న వారు ప్రజల హృదయాల్లో సుస్థిరమైన స్థానం సంపాదిస్తారని, తద్వారా ఉత్తమ సేవా మూర్తులగా నిలుస్తారని జిల్లా తూర్పుకాపు సామాజికవర్గం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.రామజోగి నాయుడు అన్నారు. నగరంలో ఓ హోటల్‌లో తూర్పుకాపు ఉద్యోగ సంఘం జిల్లా సర్వసభ్య శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరగతులకు అతీతంగా అనేక రకాల సేవలు అందిస్తూ... ముందుకు సాగుతున్న ఎందరో మహానుభావులు ప్రేరణతో ఈ సంఘం అవతరించిందని అన్నారు. సామాజిక తరగతికి చెందిన వారు వివిధ రంగాల్లో, పోటీ పరీక్షల్లో ప్రతిభా పాటవాలు చూపిన పలువురుని గుర్తించి త్వరలో వారికి సత్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు, జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు, సెట్‌శ్రీ మేనేజర్ కాగాన వెంకటరమణలను సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పి.తమ్మినాయుడు, గౌరవ అధ్యక్షుడు అంకడాల తవిటన్న, ప్రిన్సిపాళ్ల అసోసియేషన్ సంఘం గౌరవ అధ్యక్షులు కీర్తి తవిటినాయుడు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిల్లారి నారాయణరావు, న్యాయవాది లోలుగు రాజశేఖర్, అంబేద్కర్ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ కె.రామారావు, కాయల కృష్ణమూర్తి, డాక్టర్ చక్రపాణి, శ్రీరాములునాయుడు, భీమారావు, గొర్లె మహేశ్వరరావు, పి.సురేష్ పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం



అన్నదానం చేస్తున్న డాక్టర్ సురేష్

ఇచ్ఛాపురం : పట్టణంలోని 21వ వార్డులో వినాయక ఉత్సవ కమిటీ అధ్వర్యాన శనివారం ఏర్పాటు చేసిన అన్నదానంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ భారతిదివ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఉలాల శేషుయాదవ్, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : గణపతి నవరాత్రిలు ముగిసిన సందర్భంగా సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యాన వైద్యాధికారి బొడ్డేపల్లి సురేష్ సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన 500 మంది వరకూ యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

గణపతి నవరాత్రుల సందర్భంగా నగరంలోని 19వ డివిజన్ రామ్‌నగర్ కాలనీలో హారికాప్రసాద్ కనస్ట్రక్షన్ అధినేత హారికాప్రసాద్, సిమెంట్ డీలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాము, బి.రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించారు.

కొత్తూరు : స్థానిక పడల వీధిలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మూడు వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం 101 రకాల పిండి వంటలను వండి వినాయకుని వద్ద ఉంచారు. కార్యక్రమంలో సురేష్, కె.వెంకటరమణ, వెంకటేష్, ఎస్.కిరణ్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని కింతలమిల్లు కూడలి వద్ద వినాయక నవత్రులు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు మూడు వేల మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కూన అప్పలనాయుడు, కూన మురళీధర్, సీపాన మోహన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- జలుమూరు

రోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చల్లవానిపేట సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. చల్లవానిపేటలోని అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం విశిష్టతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని రోజూ క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కొండమ్మ, రజిని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుజాత

ఒడియా భాషాభివృద్ధికి సహకరించాలి



వినతిపత్రం అందిస్తున్న ఒడియా మైనారిటీ సంఘం సభ్యులు

కవిటి: ఒడియా భాషాభివృద్ధికి సహకరించి ప్రస్తుతం జరుగుతున్న రేషనలైజేషన్ ప్రక్రియలో ఒడియా లింగ్విస్టిక్ మైనారిటీ విద్యార్థులు, ఉపాధ్యాయలకు కొన్ని ప్రత్యేక సవరణలు చేయాలని ఒడియా లింగ్విస్టిక్ మైనారిటీ సంఘం, ఎపి ఒడియా టీచర్స్ అసోసియేషన్ కోరారు. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ నేతృత్వంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను విజయనగరంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా ఒడియా లింగ్విస్టిక్ మైనార్టి సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాఢీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, మన్యం జిల్లాల్లో 120 ప్రాథమిక పాఠశాలలు, 35 ప్రాథమికోన్నత పాఠశాలలు, 32 ఉన్నత పాఠశాలల్లో 12,000 మంది విద్యార్థులు ఒడియా మాధ్యమంలో విద్యాభ్యాసం చేస్తున్నట్టు వివరించారు. వీరికి ఇప్పటిలాగే ఒడియా మాధ్యమంలోనే విద్యాబోధన కొనసాగిస్తూ, 1,2 తరగతులకు, 1 నుంచి 5 తరగతులకు తప్పనిసరిగా 2 ఎస్జిటి పోస్టులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, సత్యనారాయణ పాఢి, ఎపి ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) మాజీ అధ్యక్షుడు రఘునాథగౌడ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొలై, సంఘ సభ్యుడు ప్రసన్న లిమ్మాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాస్ శ్రీను

కష్టాలను జయించాలి

సినీనటుడు ప్రభాస్ శ్రీను

ప్రజాశక్తి- నరసన్నపేట

కష్టాలను జయించి ఎందరో ప్రముఖులు ఉన్నత స్థితికి చేరుకున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని సినీనటుడు ప్రభాస్ శ్రీను సూచించారు నరసన్నపేట పద్మావతి జూనియర్ కళాశాలలో శనివారం ఆత్మహత్య నివారణపై నిర్వహించిన అవగాహనా సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షణికావేశంలో ఆత్మహత్య అనే కారణం ఎంచుకొని ఎందరో తమ జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తున్నారని అన్నారు. వారిపై ఆధారపడి కుటుంబాలు తీరనిశోకంతో వీధిని పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ పలు విషయాలను విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జనసేన పార్టీలో చేరిన గ్రామస్తులు

జనసేనలో పలువురు చేరిక

ఇచ్ఛాపురం: మండలంలోని కేదారిపురం పంచాయతీలో తిప్పన దుర్యోధనరెడ్డి, నీలవేణి దంపతుల ఆధ్వర్యాన జనసేన పార్టీ ఇన్‌ఛార్జి దాసరి రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర కార్యదర్శి నాగుల హరిబెహరాల ఆధ్వర్యాన పలువురు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. దీనబంధుశెట్టి తన సొంత స్థలంలో కుటుంబ సభ్యులు, జనసేన నాయకులు రాజా, కాకినాడ సంతోష్, బొర మోహన్ రెడ్డి సహకారంతో జనసేన జెండా స్థూపాన్ని నిర్మించారు. అనంతరం జనసేన క్రియాశీలక సభ్యులకు ప్రమాద బీమా కిట్లను పంపిణీ చేశారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై 25 కుటుంబాలకు చెందిన గ్రామస్తులు, మహిళలు, వృద్ధులు చేరారని నాయకులు తెలిపారు. కేదారిపురం పంచాయతీలో డ్రెయినేజీ సమస్యల పట్టిపీడిస్తుందని, దీనిపై పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శించారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం

శ్రీకాకుళం అర్బన్ : పేదలకు మేలు చేయాలన్న తలంపుతో 'వాల్ ఆఫ్ కైండ్ నెస్' పేరిట మాజీ మున్సిపల్ చైర్మన్ అంధవరపు వరహ నరసింహం కుమారులు చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమని వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. వాల్ ఆఫ్ కైండ్ నెస్ కేంద్రం వద్ద వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ మేరకు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ మేరకు వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరం కుమారులు అంధవరపు ప్రసాద్, సంతోష్, లయన్స్ క్లబ్ సెంట్రల్ నటుకుల మోహన్, పూర్వపు అధ్యక్షులు డాక్టర్ బాడాన దేవభూషణ్, వావులపల్లి జగన్నాథం నాయుడు, మండవల్లి రవి, గుత్తు చిన్నారావు, సీజు, మణి పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు